క్లుప్తంగా

శిల్పారామం అభివృద్ధికి నిధులు

కడప సెవెన్‌రోడ్స్ : శిల్పారామం అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తామని రాష్ట్ర శిల్పారామాల చైర్ పర్సన్ చేరెడ్డి మంజులారెడ్డి తెలిపారు. గురువారం ఆమె శిల్పారామాన్ని సందర్శించి అక్కడి కల్యాణ మండప డార్మెంటీ, బోటింగ్, టిక్కెట్ కౌంటర్లు, గేమ్స్ పరిశీలించారు. శిల్పారామం పరిపాలనాధికారి కృష్ణప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీరు వెంకట సుబ్బయ్యలను అడిగి పనుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్యాణ మండపం నుంచి డార్మెంటరీ వరకు ఫెన్సింగ్ ఏర్పాటు కోసం నిధులు ఇచ్చామన్నారు. వాటర్ గేమ్స్, గుంటూరులో ఏర్పాటు చేసిన విధంగా కడపలో కూడా వాటర్ ఫాల్స్ ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగల వారికి అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. పీపీపీ పద్ధతిలో ఫుడ్‌నెస్ సెంట్రల్ ఏర్పాటుకు అవకాశం కల్పిస్తామన్నారు.

ఆ యానిమేటర్‌ను నియమించవద్దు

కడప రూరల్ : అడ్డదారుల్లో యానిమేటర్ నియామకానికి చేస్తున్న ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయాలని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు మార్టిన్ జోసఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మంగారిమఠం మండలంలో జిల్లా సమైఖ్యలో కీలక బాధ్యతలు చేపడుతున్న ఒక సభ్యురాలు, అడ్డదారుల్లో యానిమేటర్‌గా నియామకానికి ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. యానిమేటర్‌గా నియామించాలంటే మెజార్టీ సంఘ సభ్యుల తీర్మానం ఉండాలని తెలిపారు.

సైన్స్ మ్యూజియం పరిశీలన

కడప ఎడ్యుకేషన్ : కడప చెన్నూరు బస్టాండ్‌లోని జిల్లా సైన్స్ మ్యూజియాన్ని గురువారం స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కల్పన పరిశీలించారు. సైన్సు మ్యూజియంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఆరా తీశారు. దీంతో పాటు సైన్స్ పరికరాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే మ్యూజియంలో ఏర్పాటు చేసిన పరకరాలను పరిశీలించి అక్కడ సిబ్బందితో మాట్లాడారు. ఈమె వెంట సైన్సు మ్యూజియం క్యూరేటర్ రెహమాన్ ఉన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలని పోతన సాహిత్య పీఠం ప్రెసిడెంట్ డాక్టర్ పసుపులేటి శంకర్ పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఒరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత సాఫ్ట్‌వేర్ సాంకేతికను అందిపుచ్చుకోవాలని తెలిపారు. కళాశాల చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రాంగణ నియామకాలలో ఉద్యోగం పొందేలా విద్యార్థులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గౌస్ నగర్‌లో సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని 27వ డివిజన్ గౌస్‌నగర్‌లోని సమస్యలను నగరపాలక సంస్థ అధికారులు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు సయ్యద్ గౌస్‌పీర్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని 27వ డివిజన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని వీధుల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. పింఛన్లు, రేషన్ కార్డులు రద్దు తదితర అంశాలపై సంబంధిత అధికారులను కలిసి వినతి ప్రతాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో 27వ డివిజన్ ఇన్‌చార్జి షామీర్ హుస్సేన్, యూసుఫ్, షేక్ నీలం, జాబిర్ అలీ, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ రుణ మంజూరులో నిర్లక్ష్యం

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులు పొదుపు చేసుకున్న భవిష్యనిధి రుణాల మంజూరులో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ.. ఉపాధ్యాయులను వేధిస్తున్న జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. గురువారం కడపలోని కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.విశ్వేశ్వర నాయుడును కలిసి ప్రావిడెంట్ ఫండ్ రుణాల మంజూరులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జూనియర్ అసిస్టెంట్ శివజ్యోతిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, బత్తుల చంద్రశేఖర్, డి.సుబ్బారావు, వై.రామకేశవులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో అప్రజాస్వామిక విధానాలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రధాని నరేంద్రమోదీ పాలనలో అప్రజాస్వామిక విధానాలు రాజ్యమేలుతున్నాయని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ధ్వజమెత్తారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలోఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీని రాజకీయంగా ఎదుర్కోవడంలో మోదీ విఫలయ్యారని తెలిపారు.

భావి తరాలకు మార్గదర్శి

- ఆదర్శ ఉపాధ్యాయుడు 'గుండాచారి'
- నేటికీ ఆయన పేరుతోనే పాఠశాలకు గుర్తింపు
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం





నాగరాజుపేటలోని గుండాచారి హైస్కూలు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నాగరాజుపేటలోని మున్సిపల్ హైస్కూలును నగర ప్రజలంతా 'గుండాచారి బడి'గా పిలుస్తారు. ఆ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ 65 ఏళ్ల క్రితమే ఉద్యోగ విరమణ చేసి, 36 ఏళ్ల క్రితం మరణించినా ఆయన పేరు నేటికీ వినిపించడానికి వృత్తి పట్ల నిబద్ధత, అంకితభావమే కారణం. ఉపాధ్యాయ వృత్తిలోనే కాకుండా నాటక రంగం, ధార్మిక కార్యక్రమాల్లో ఆయన విశిష్ట కృషి ఆదర్శంగా నిలిచారు.

ఉపాధ్యాయుడిగా..

ఆళ్లగడ్డ వద్ద ఉన్న పడకండ్ల గ్రామానికి చెందిన ఆయన పూర్వీకులు కడపకు వచ్చి స్థిరపడ్డారు. గుండాచారి జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల స్కౌట్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేవారు. 1938లో నాగరాజుపేటలో ఏర్పాటైన మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఆయన పనిచేశారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతోపాటు నీతి కథలు, నైతిక ప్రవర్తన, క్రమశిక్షణ వంటివి బోధించేవారు. విద్యార్థుల తల్లిదండ్రులతోసైతం సత్సంబంధాలు నెరిపేవారు. ఆయన కృషి కారణంగా నగరంలో ఆ పాఠశాలకు గుర్తింపు రావడమే కాకుండా అభివృద్ధి చెందింది. ఓసారి ఆయన్ను బదిలీ చేయగా, గుండయ్యే తమకు కావాలంటూ స్థానికులు ఆందోళనలు నిర్వహించడంతో బదిలీ రద్దయింది. 1960లో ఆయన ఉద్యోగ విరమణ చేసినప్పటికీ క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి ప్రార్థనా కార్యక్రమంలో విద్యార్థులకు సూక్తులు చెప్పేవారు. ఎవరైనా ఉపాధ్యాయులు రాకపోతే ఆయనే పాఠాలు బోధించేవారు. నాటి కలెక్టర్లు తమ పిల్లలకు గుండాచారితో ట్యూషన్లు చెప్పించుకునేవారు. పిట్టకథలు, హాస్యాన్ని జోడించి ఆయన బోధించే పాఠాలు విద్యార్థులను బాగా ఆకట్టుకున్నాయి. కడప ఆఫీసర్స్ క్లబ్‌లో టెన్నిస్ క్రీడకు గుండాచారినే రెఫరీగా నియమించుకునేవారు.

నాటక రంగంలో విశిష్ట గుర్తింపు

కళా ప్రపూర్ణ బళ్లారి రాఘవ, పద్మశ్రీ చిత్తూరు నాగయ్య, వేమూరి గగ్గయ్య, స్థానం నరసింహారావు, ఈలపాట రఘురామయ్య, కన్నాంబ, రుష్యేంద్రమణి, సూరిబాబు, కొండపేట కమాల్ వంటి మహామహులతో కలిసి అనేక నాటక ప్రదర్శనలు నిర్వహించారు. స్త్రీ పాత్రలు అద్భుతంగా పోషించి ప్రశంసలందుకున్నారు.

దాస సాహిత్యం వైపు

ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పటికీ కళా, సాహిత్య, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించేవారు. హరిదాస సాహిత్యం గురించి అప్పట్లో తెలిసిన వారు తక్కువ. బ్రాహ్మణ వీధికి చెందిన గుండాచారి అదే వీధిలోని ప్రముఖ న్యాయవాది కమలాపురం కృష్ణమూర్తిరావుతో కలిసి దాస సాహిత్యాన్ని ఆలపించేవారు. రాఘవేంద్రస్వామి మఠంలో పురంధరదాస్ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆరాధనోత్సవాలు స్వంత ఖర్చులతో ఎంతో ఘనంగా నిర్వహించేవారు.

వృత్తిపట్ల అంకితభావం



ఉపాధ్యాయ వృత్తి పట్ల ఆయనకు ఎంతో నిబద్ధత, అంకితభావం ఉండేదని చెబుతుంటే విన్నాం. అందుకే నేటికీ ఆయన పేరుతోనే పాఠశాలను ప్రజలు పిలుస్తున్నారు. ఆయన పనిచేసిన పాఠశాలలో నేనూ పనిచేస్తున్నందుకు గర్విస్తున్నాను.

\- అఫ్రఫున్, ప్రధానోపాధ్యాయురాలు, గుండాచారి హైస్కూలు, కడప

సేవలు చిరస్మరణీయం



ఆయనను నేను ప్రత్యక్షంగా చూశాను. మా నాన్న పాఠశాలల ఇన్‌స్పెక్టర్ కావడంతో మా ఇంటికి తరచూ వచ్చేవారు. పిల్లలకు పాఠాలతోపాటు క్రమశిక్షణ బాగా నేర్పించేవారు. ఆయన వద్ద చదువుకున్న పిల్లలు తర్వాత కాలంలో మంచి స్థానాల్లో స్థిరపడ్డారు. నేటి ఉపాధ్యాయులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి.

\- జానమద్ది విజయభాస్కర్, అధ్యక్షులు, జానమద్ది సాహితీపీఠం, కడప

బహుముఖ ప్రజ్ఞాశాలి



ఉపాధ్యాయ వృత్తిలో ఆయన అందించిన విశిష్ట సేవల వల్లే నేటికీ ప్రజల హృదయాల్లో ఆయన జీవించే ఉన్నారు. వృత్తితోపాటు నాటకాల్లో బాగా రాణించారు. యేటా పురంధరదాసు వేశాన్ని ధరించి ఆరాధన ఉత్సవాలు సొంత ఖర్చులతో ఘనంగా నిర్వహించేవారు.

\- ఎంఎల్ఎన్ సురేష్, మాజీ కార్పొరేటర్, కడప

ఏఎఫ్‌యూ ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో గురువారం ఆర్కిటెక్చర్ విభాగానికి సంబంధించిన 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, ప్రత్యేకంగా నిర్వహించిన పదవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి. విశ్వనాథ కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ అదనపు పరీక్షల నియంత్రనాధికారి డాక్టర్ జి. ఫణీంద్ర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సౌకార్యార్థం త్వరితగతిన ఫలితాలు విడుదల చేశామని తెలిపారు. సహాయ పరీక్షల నియంత్రనాధికారి ఉదయప్రకాష్ రెడ్డి, నారపరెడ్డి, వర్సిటీ ప్రజాసంబంధాల అధికారి వి. శివక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

గురువులకు గౌరవం


నాగమణి


దాది నాగరాజు

కడప ఎడ్యుకేషన్ : పనితీరులో రాష్ట్రస్థాయి గుర్తింపు సాధించిన కడప నగరపాలక ప్రధానోపాధ్యాయులకు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు లభించాయి. కడప గాంధీనగర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.నాగమణి, సాయిపేట 8వ వార్డు ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాది నాగరాజు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికయ్యారు. నాగమణి గతంలో మెయిన్ స్కూల్‌లో పని చేసిన సమయంలో రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందారు. పాఠశాలకు క్రీడల్లో స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులు రావడంలోనూ పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించారు. అదేవిధంగా విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు వీరు కృషి చేశారు.

విద్యార్థుల ఉన్నతే గురువులకు ఆనందం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవిరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థుల ఉన్నతే గురువులకు ఆనందమని ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి పేర్కొన్నారు. భారత జాతీయ కళా సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కడప గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గురువులను ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఇంటాక్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్, కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె. చిన్నపరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని పేర్కొన్నారు. ఇంటాక్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్, కడప చాప్టర్ కన్వీనర్ కె. చిన్నపరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. విద్యార్థి జీవితంలో గురువు స్థానం పవిత్రమైనదని వైవీయూ రిజిస్ట్రార్ డాక్టర్ పుత్తా పద్మ అన్నారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి, కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీం బాషా, గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు నాగమణి తదితరులు ప్రసంగించారు. అనంతరం విద్యావేత్తలను సత్కరించి మెమెంటోలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, విద్యావేత్తలు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

పవిత్ర జీవనాన్ని అలవర్చుకోవాలి


మరియమాత సందేశాన్ని అందజేస్తున్న ఎర్రగుంట్ల విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఐ.మోజెస్

కడప సెవెన్‌రోడ్స్ : మరియమాతలాగా పవిత్ర జీవనాన్ని అలవర్చుకోవడం ద్వారానే దేవుని కృపకు పాత్రులు అవుతామని ఎర్రగుంట్ల విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఐ.మోజెస్ అన్నారు. కడప నగరంలోని ఆరోగ్యమాత ఉత్సవాల్లో ఏడవ రోజైన గురువారం తొలుత ప్రొద్దుటూరు డీన్ పీటర్ ప్రభాకర్ దివ్యమాతకు పూజలు సమర్పించారు. దేవమాతను గుడిచుట్టూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఫాదర్ మోజెస్ మాట్లాడారు. మరియమాత నిష్కళంక, పాపము లేని స్త్రీ అని పేర్కొన్నారు. అందుకే ఆమె దేవమాతగా నిలిచారని వివరించారు. ఆమె చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవడం వల్ల దేవుడిని చేరుకోగలరన్నారు. మోన్ సిగ్నోర్ రెవరెండ్ ఫాదర్ ఎండీ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సహాయ గురువులు ఫాదర్ బి.జ్వాన్నెస్, ఫాదర్ డేవిడ్‌రాజు, కమిటీ సభ్యులు, కన్యస్త్రీలు, భక్తులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి


సంప్రదాయ దుస్తులతో చిన్నారులు

కడప ఎడ్యుకేషన్ : మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుని, భవిష్యత్ తరాలకు అందించాలని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ జిల్లా మేధావి సమాఖ్య అధ్యక్షుడు వివేకానంద రెడ్డి సూచించారు. కేరళ రాష్ట్ర ప్రజల ప్రత్యేక పండుగ ఓనం సందర్భంగా శుక్రవారం కడప నగరంలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులు అలవర్చుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి సంధ్య, ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత


విజయదుర్గాదేవికి పూజలు చేస్తున్న అశ్విన్‌బాబు

కడప సెవెన్‌రోడ్స్ : ఆధ్యాత్మికత మానసిక ప్రశాంతతకు మార్గమని సినీ నటుడు అశ్విన్‌బాబు అన్నారు. గురువారం అశ్విన్ నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయాన్ని, ఎన్జీఓ కాలనీలోని వినాయ స్వామి విగ్రహాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కడప నగరంలో ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న అమీన్‌పీర్ దర్గాను దర్శించారు. అనంతరం దేవునికడపలో శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అభిమానులు, యువకులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీడీఏగా నాగరాజు

కడప అగ్రికల్చర్ : ఊటకూరు భూసార పరీక్ష కేంద్ర ఇన్‌చార్జి డీడీఏగా నాగరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈ ఇక్కడ పనిచేస్తున్న సుబ్రహ్మణ్యేశ్వరావు పదోన్నతిపై బాపట్లకు వెళ్లారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి డీడీఏగా నాగరాజు బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సాంకేతిక పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం, భూసార పరీక్షలు అంటి అంశాలపై రైతులకు శిక్షణ ద్వారా అవగాహన కల్పిస్తామని తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ ఫ్రీడం ప్లాన్‌కు విశేష స్పందన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : భారత ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ ఒక రూపాయికే తీసుకువచ్చిన ఫ్రీడమ్ ప్లాన్‌కు విశేష స్పందన లభిస్తోందని బీఎస్ఎన్ఎల్ జిల్లా జనరల్ మేనేజర్ ముజీబ్ పాషా పేర్కొన్నారు. గురువారం నగరంలోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1న తీసుకువచ్చిన ఈ ప్లాన్‌కు ఉమ్మడి కడప జిల్లాలో దాదాపు 6,000 మంది వినియోగదారులు ఈ ఫ్రీడమ్ ప్లాన్ ను తీసుకున్నట్లు తెలిపారు. ఈ ప్లాన్ గడువు ఈనెల 15 వరకు ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో వడ్డించాలని ఇంటర్ జిల్లా వృత్తి విద్యాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం కడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజానాన్ని పరిశీలించి పిల్లలకు భోజనాన్ని వడ్డించాలరు. అలాగే అధ్యాపకులకు పలు సూచ,నలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హబీబుల్లా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతిక విజ్ఞానం వల్లే పురోగతి

కడప ఎడ్యుకేషన్ : ఆధునిక సమాజంలో అన్నిరకాల పురోగతికి శాస్త్ర, సాంకేతిక విజ్ఞానమే మూలాధారమని తిరుపతికి చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఆచార్య ఈశ్వర రామిరెడ్డి, ఆచార్య అనిల్ అన్నారు. గురువారం భారతీయ విజ్ఞాన సమ్మేళనంపై యోగివేమన విశ్వవిద్యాలయంలోని అన్నమాచార్య సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ విజ్ఞానం, సాంకేతికతల ఆవశ్యకత గురించి వివరించారు. భారతీయ, సాంకేతికత విజ్ఞానం మహోన్నతమైనదని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్, డీన్లు ఆచార్య చంద్ర బబుశ రెడ్డి, ఆచార్య ఏజీ దాము, సంచాలకులు డాక్టర్ సుబ్రహ్మణ్య శర్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి భవితకు విజ్ఞాన్ మంథన్


కరపత్రాలను విడుదల చేస్తున్న సమగ్ర శిక్ష రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కల్పన

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థుల భవితకు విజ్ఞాన్ మంథన్ తోడ్పడుతుందని సమగ్ర శిక్ష రాష్ట్ర అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కల్పన పేర్కొన్నారు. గురువారం కడపలోని సైన్స్ మ్యూజియంలో జాతీయ ప్రతిభాన్వేషణా పరీక్ష 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' 2025కు సబంధించిన కరపత్రాలను ఆమె ఆవిష్కించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్షను నిర్వహిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభాన్వేషణ పరీక్షను ఎన్‌సీఈఆర్టీ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం, విజ్ఞాన భారతి సంయుక్తంగా నిర్వహిస్తున్నాయన్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి భారతదేశ ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ప్రవేశ పరీక్షలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు సెప్టెంబరు 30వ తేదీలోగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు విద్యార్థి విజ్ఞాన్ మంథన్ వేదికగా నిలుస్తుందనడంలో ఏ మాత్రం సందేహం లేదన్నారు. ప్రతి విద్యార్థి ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి విజ్ఞాన్ మంతన్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసుల రెడ్డి, సైన్స్ మ్యూజియం క్యురేటర్ రెహమాన్, సీవీ రామన్ సైన్స్ క్లబ్ కడప డివిజన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు, సమగ్ర శిక్ష సెక్టరల్ ఆఫీసర్ రమణమూర్తి పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఆరోగ్య బీమా పాలసీలను ఆదరించాలి


మాట్లాడుతున్న ఎస్ఎండీ రవికుమార్

కడప సెవెన్‌రోడ్స్ : జీవిత బీమా సంస్థ అమలు చేస్తున్న ఆరోగ్య బీమా పాలసీ ప్రయోజనాలను గుర్తించి ప్రజలు ఆదరించాలని ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ రవికుమార్ పిలుపునిచ్చారు. గురువారం బీమా వారోత్సవాల్లో భాగంగా ఎల్ఐసీ కార్యాలయంలో హెల్త్ టాక్, హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీ విహారి మాట్లాడుతూ క్యాన్సర్ త్వరగా గుర్తించి చికిత్స చేస్తే ప్రాణాంతకం కాదన్నారు. క్యాన్సర్‌కు సంబంధించిన అపోహలను, కారణాలను, నివారణలను వివరించారు. క్యాన్సర్ చికిత్సకు అమెరికాలో ఉన్న వైద్య సౌకర్యాలు కడప వంటి నగరాల్లో కూడా ఉన్నాయని తెలిపారు. సరైన ఆరోగ్యానికి నడక, తాజా కూరగాయలు, పండ్లు తినడం చాలా ముఖ్యమన్నారు. అనంతరం డాక్టర్ సాయి చరిత మాట్లాడుతూ మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ నివారించడానికి హెచ్‌పీవీ వ్యాక్సిన్ చాలా ముఖ్యమన్నారు. మెడికల్ క్యాంప్ లో భాగంగా సిబ్బందికి బీపీ, షుగర్, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యులను ఎల్ఐసీ అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్ సుందర్ రావు, మేనేజర్లు సత్య ప్రసాద్, సత్య శ్రీనివాస్, లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

హోం గార్డుల ఆదర్శం

- పదవీ విరమణ పొందిన హోం గార్డుకు రూ.4,14,640 ఆర్థిక సాయం
- హోం గార్డుల ఐకమత్యాన్ని అభినందించిన జిల్లా ఎస్పీ


హోంగార్డు కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్ : మానవత్వం, ఐకమత్యం కేవలం మాటల్లోనే కాదని, చేతల్లో కూడా ఉంటుందనీ జిల్లాలోని హోం గార్డులు నిరూపించారు. తమతో కలిసి విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన హోమ్ గార్డుకు అండగా నిలిచి అందుకున్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో కమ్యూనికేషన్ విభాగంలో హోమ్ గార్డుగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల టి.వి జయరాజు (హెచ్.జీ 85) పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనకు సహాయం చేసేందుకు జిల్లాలోని హోం గార్డులందరూ ముందుకు వచ్చారు. స్వచ్ఛందంగా ఒకరోజు వేతనాన్ని వితరణగా ఇచ్చారు. ఈ ఆర్థిక సాయాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ చేతుల మీదుగా రూ. 4,14,640 చెక్కును ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్న టి.జయరాజు కుటుంబానికి అందజేశారు. హోమ్ గార్డుల ఐకమత్యాన్ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. పదవీ విరమణ పొందిన హోమ్ గార్డు విజయరాజు కుటుంబ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ శ్రీశైలరెడ్డి పాల్గొన్నారు.

ఉండ్రాళ్లయ్యా .. ఉంటామయ్యా


నిమజ్జనానికి తరలుతున్న భారీ వినాయకుడు


వినాయకుడి లడ్డూను తీసుకెళ్తున్న కార్పొరేటర్ గంగాదేవి

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం ఎన్జీఓ కాలనీలో ఏర్పాటు చేసిన భారీ గణపతి విగ్రహ నిమజ్జనం గురువారం వైభవంగా నిర్వహించారు. అశేష భక్తజనం వెంట రాగా, భక్తిపారవశ్యంతో గణపతి బప్పా మోరియా నినాదాల మధ్య భారీ వినాయకుడు నిమజ్జనానికి బయలుదేరారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గతనెల 27వ తేదిన నగరంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తొమ్మిది రోజులపాటు భక్తులు నిర్వహించారు.

ప్రతిరోజు నగర వాసులతోపాటు నగర పరిసర ప్రాంతాల ప్రజలు స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు.కడపలోని ప్రధాన రహదారుల మీదుగా భక్తుల జైబోలో గణేష్ మహారాజ్‌కీ అంటూ చేసిన నినాదాలు నగరమంతటా మార్మోగాయి. ఎన్‌జీవో కాలనీలోని గంగమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను లక్కీడీప్ ద్వారా 9వ డివిజన్ ఇన్‌చార్జి మల్లికార్జున కిరణ్, కార్పొరేటర్ గంగాదేవి దంపతులు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమాలను ఉత్సవ కమిటీ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు రామారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నిర్వాహకులు శ్రీనివాసులరెడ్డి, అఖిలేష్ పర్యవేక్షించారు.

రాజుల వీధిలో..

కడప నగరం మృత్యుంజయకుంట రాజులవీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని స్థానిక ప్రజలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా లడ్డూ వేలం పాట నిర్వహించారు. మొదటి లడ్డూను నారకట్ల చంద్ర అనే భక్తుడు రూ. 90 వేలకు దక్కించుకున్నాడు. రెండవ ఖవ్వా లడ్డూను కంచురెడ్డి మురళి అనే భక్తుడు రూ. 45 వేలకు వేలం పాటలో దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు రామకృష్ణనాయుడు, నరేష్‌రాజు, ప్రభాకర్‌రాజు, రామునాయుడు, రాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.